నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, సోమవారం 23 జూన్ 2025 | HYDERABAD

మహేశ్వరం మండలం మన్సాన్‌పల్లి గ్రామానికి చెందిన మర్యాద రాఘవేందర్‌రెడ్డితో పాటు వందలాదిమంది కార్యకర్తలు ఆదివారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎమ్మెల్యే వారందరికీ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. - బడంగ్‌పేట IVలో

అశోక్‌నగర్ నాలాపై మరో వంతెన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. ఈ వంతెన అందుబాటులోకి వస్తే చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ నుంచి లిబర్టీ చౌరస్తా వరకు ప్రయాణం సులువుగా మారుతుంది.

ఆగని చలాన్ల మోత ..!

రోడ్లపై చెత్త వేసిన 3138 మందికి రూ.58.95 లక్షల పెనాల్టీలు

భవన నిర్మాణాల వ్యర్థాలు వేసిన 522 మందికి రూ. 46.85 లక్షల జరిమాన

సున్నం చెరువు నుంచి గుట్టల బేగంపేట వెళ్లే మార్గంలో పేరుకుపోయిన వ్యర్థాలు

సిటీబ్యూరో, జూన్ 22 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ జనంపై జీహెచ్ఎంసీ చలాన్ల మోత మోగిస్తున్నది. రహదారులపై చెత్త వేసిన వారిపై రూ. 500 నుంచి రూ. 25వేల వరకు, భవన నిర్మాణ వ్యర్థాలు వేసిన వారికి రూ. 25 వేల నుంచి 2 లక్షల వరకు జరిమానాలు విధిస్తున్నది. అధికారులు వివిధ వ్యాపారస్తులు, దుకాణాదారులే లక్ష్యంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీ పీలు భవన నిర్మాణ వ్యర్థాలు వేసే వారిపై దృష్టి సారించింది. రోడ్ల మీద చెత్త వేసినందుకు ఇప్పటి వరకు సీసీఎంఎస్ ద్వారా రూ. 58.95 లక్షల జరిమానాలు విధించారు. 30 సర్కిళ్ల పరిధిలో 3,138 చలాన్లు జారీ చేయగా రూ. 58.95 లక్షల జరిమానాలు విధించారు. 2,154 మంది పెనాల్టీలు కట్టగా.. రూ.22.32 లక్షల ఆదాయం ఖజానాలో చేరింది. 984 చలాన్లకు సంబంధించి రూ. 36.62 లక్షల ఆదాయం రావాల్సి ఉంది. సరాసరిగా ఒక్క రోజులో లక్ష వరకు పెనాల్టీలు విధిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే భవన నిర్మాణ వ్యర్థాలను ఎక్కడిపడితే అక్కడ వేసిన వారిని గుర్తించి వారిపై చలాన్లు విధిస్తున్నారు. ఇందులో భాగంగానే 30 సర్కిళ్లలో 522 చలాన్లు జారీ చేయగా, రూ.46.85 లక్షల జరిమానాలు విధించారు. 218 చలాన్లకు రూ.13.80 లక్షల జరిమానాలు వసూలయ్యాయి. 304 మంది నుంచి రూ.33.05 లక్షల మేర వసూలు కావాల్సి ఉంది. స్పెషల్ డ్రైవ్‌లు పెట్టి జరిమానాల విధిస్తున్నారు సరే మరీ ఇంటింటి చెత్త సేకరణలో ఎందుకు నిర్వహణ సరిగా చేపట్టడం లేదంటూ నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు.

రోడ్లపై చెత్త వేసిన వారిపై విధించిన జరిమానాలు (టాప్ ఐదు సర్కిళ్లు)

సర్కిల్	చలాన్లు జారీ	పెనాల్టీలు (రూ.ల్లో)
కూకట్‌పల్లి	779	5,58,300
ఉప్పల్	453	6,13,500
ఖైరతాబాద్	221	3,27,400
సికింద్రాబాద్	142	2,88,900
మూసాపేట	134	8,62,200

రోడ్లపై భవన నిర్మాణ వర్థ్యాలు వేసిన వారిపై వేసిన జరిమానాలు

సర్కిల్	చలాన్లు జారీ	పెనాల్టీలు (రూ.ల్లో)
సికింద్రాబాద్	58	6,30,000
మల్కాజిగిరి	57	6,85,000
జూబ్లీహిల్స్	54	2,90,000
కాప్రా	46	2,30,000
కూకట్‌పల్లి	39	1,95,000

సందేహం తీరేదెన్నడు?

- హెచ్ఎండీఏలోని విలీన గ్రామాల్లో అమలుకాని బిల్డ్ నౌ IVలో
- ఇప్పటికీ సంబిగ్ధంలోనే నిర్మాణదారులు
- బిల్డ్ నౌ అమల్లోకి వచ్చినా... అవగాహన కల్పించని హెచ్ఎండీఏ

ఎలివేటెడ్ భూములు నవాబులదే

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోటీసులకు స్పందించాలి
- న్యాయ సలహాదారుడు గడ్డం అబేల్ IIలో

గ్రేటర్@34.5

సిటీబ్యూరో, జూన్ 22, (నమస్తే తెలంగాణ): కిందిస్థాయి గాలులు పశ్చిమ దిశ నుంచి వీస్తుండడంతో గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని దాటి నమోదవుతున్నాయి. రాగల మరో రెండు రోజులు కూడా గ్రేటర్‌లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశాలు ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. ఇదిలా ఉండగా, ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠం 34.5, కనిష్ఠం 24 డిగ్రీలు, గాలిలో తేమ 41 శాతంగా నమోదైనట్లు తెలిపారు.

రోడ్లను బాగు చేయండి

కొండాపూర్: అస్తవ్యస్తమైన రోడ్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ ఆదివారం శేరిలింగంపల్లి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున నిరసన ర్యాలీ నిర్వహించారు. చందానగర్ డివిజన్ సీనియర్ నాయకుడు పారునంది శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. చందానగర్ డివిజన్ రాజేందర్ రెడ్డి నగర్ నుంచి శ్రీదేవి థియేటర్ వరకు సాగిన ఈ ర్యాలీలో నియోజకవర్గం సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వెంటనే రోడ్డు పనులను ప్రారంభించి.. ప్రజల ఇబ్బందులను తొలగించాలంటూ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే, కార్పొరేటర్ చొరవ తీసుకుని పనులను ప్రారంభించేలా చూడాలంటూ ప్రజల తరపున కోరారు.

మెట్రో సాధించే దాకా..

ఉద్యమ కార్యాచరణకు సిద్ధం

- మేడ్చల్ మెట్రో సాధన సమితి నిర్ణయం
- ఇప్పటికే కేంద్రానికి విస్తరణ ప్రతిపాదనలు
- అనుమతుల్లో జాప్యానికి తావులేకుండా.. కేంద్రంపై ఒత్తిడి పెంచేలా కార్యక్రమాలు

సిటీబ్యూరో, జూన్ 22(నమస్తే తెలంగాణ): మేడ్చల్ మెట్రో సాధన కోసం స్థానికులు ఉద్యమ కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. రెండో దశ విస్తరణలో భాగంగా జేబీఎస్ నుంచి మేడ్చల్, జేబీఎస్ నుంచి శామీర్‌పేట మార్గంలో నిర్మించాల్సి ఉండగా, కేంద్రానికి డీపీఆర్ సమర్పించినట్లు మెట్రో సంస్థ వెల్లడించింది. ఈ క్రమంలో కేంద్రం వద్ద డీపీఆర్ అనుమతుల విషయంలో జాప్యం లేకుండా ఉండేందుకు తెలంగాణలో ఉన్న బీజేపీ నేతలను సంప్రదింపులు, చర్చలు, ఫ్లకార్డుల ప్రదర్శన వంటి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ నుంచి ఎంపికైన బీజేపీ ఎంపీలతో పాటు, పార్టీలకతీతంగా అన్ని పార్టీల నేతలను కలిసి తమ ప్రాంత ప్రయోజనాల కోసం పనిచేస్తామని మేడ్చల్ మెట్రో సాధన సమితి వెల్లడించింది. నిత్యం 30 లక్షల మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతానికి అధునాతన రవాణా సదుపాయాలే.. నిత్యం ఎదురయ్యే ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్నారు.

మూడు నెలల ఆలస్యం తర్వాత..

మూడు నెలల ఆలస్యం తర్వాత మెట్రో విస్తరణ ప్రతిపాదనలు కేంద్రానికి చేరాయి. ఇప్పటికీ రెండో దశ పార్ట్ ఏకు అనుమతులు రాలేవు. ఈ క్రమంలో పార్ట్ బీ విషయంలో ఏ మాత్రం జాప్యానికి తావు లేకుండా కేంద్రంలో ఉన్న బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వ నేతలపై ఒత్తిడి పెంచాలని మెట్రో సాధన సమితి భావిస్తున్నది. నిర్ణీత కాలంలో ప్రాజెక్టు పనులు మొదలు కావాలంటే, అనివార్యంగానే ప్రజల మద్దతు కూడగట్టేలా కార్యాచరణ అవసరమని సాధన సమితి సభ్యులు పేర్కొంటున్నారు. తమ ప్రాంతానికి మెట్రో సాధన కోసం ఇన్నాళ్లు రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, మెట్రో సంస్థతో సంప్రదింపులు చేసినట్లుగానే... ఇకపై ఢిల్లీ స్థాయిలో ప్రభావితం చేసేలా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో బీజేపీ ఎంపీలను కలిసి తమ ప్రాంతానికి మెట్రో ఆవశ్యకతను వివరిస్తామని పేర్కొంటున్నారు.

పాత బాకీ వదిలెయ్.. కొత్త కనెక్షన్ తీసుకో..!

- దక్షిణ డిస్కంలో పేరుకున్న మొండిబకాయిలు
- బాకీలు పడితే కట్టని హెచ్‌టీ కనెక్షన్ల యజమానులు
- వేరే పేరుతో కొత్త కనెక్షన్ తీసుకుంటున్న వైనం
- 725 హెచ్‌టీ కనెక్షన్లు.. రూ.529 కోట్ల బకాయిలు
- మరో పేరుతో కొత్త కనెక్షన్ తీసుకుంటున్న బాకీదారులు
- సహకరించిన ఇంజినీర్లపై చర్యలకు నిర్ణయం

సిటీబ్యూరో, జూన్ 22(నమస్తే తెలంగాణ): 'బాకీ ఉన్నామా.. వదిలేయ్. మనసారే ఉన్నాడు కదా.. కొత్త కనెక్షన్‌కు అప్లై చేయి. బాకీలో కొంత మొత్తం ఆయనకే సమర్పించుకుంటే కొత్త కనెక్షన్ వస్తుంది. పాత ముచ్చట వదిలేయండి' అంటూ మేడ్చల్ జిల్లాలో ఒక సర్కిల్‌కు చెందిన ఓ పరిశ్రమ యజమాని తన అకౌంటెంట్‌కు చెప్పి తానుబాకీ ఉన్న రూ.82లక్షలకు బదులు అక్కడి సర్కిల్ ఉన్నతాధికారితో సహా ఆయన చెప్పిన సిబ్బందికి రూ.15 లక్షలు ఇచ్చి కొత్త కనెక్షన్ తీసుకున్నారు. ఇప్పుడు తీసుకున్న కొత్త కనెక్షన్‌లోనూ ఎక్కువ మొత్తంలోనే బాకీ పడ్డట్లు సమాచారం.

ఇలాంటి కనెక్షన్ల దందా ప్రధానంగా గ్రేటర్ శివార్లో ఎక్కువగా జరుగుతోంది. నెమలినగర్, గోపన్‌పల్లి, కోకాపేట, కోహెడ, తట్టిఅన్నారం, అబ్దుల్లాపూర్‌మెట్, మాన్సాన్‌పల్లి, అజిజ్‌నగర్, కందుకూరు, కే సింగారం, మల్లాపూర్, వాయుపురి, ఉప్పల్‌భగాయత్, దుండిగల్ వంటి ప్రాంతాల్లో ఉన్న హెచ్‌టీ కనెక్షన్లలో ఈ దందా జరుగుతున్నట్లు సమాచారం. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో కొత్తగా ఇండస్ట్రీస్ రావడం, హైరైజ్‌డ్ నిర్మాణాలు రావడంతో వాటికి సంబంధించి విద్యుత్ వినియోగం పెరుగుతోంది. గతంలో ఉన్న వాటికి భారీగా బిల్లులు పేరుకుపోవడంతో వాటి స్థానంలోనే కొత్త కనెక్షన్ తీసుకోవడానికి స్థానిక అధికారుల సలహాతో అక్రమంగా పేరు మార్చి కొత్త కనెక్షన్లు తీసుకుంటున్నారు.

రూ.300 కోట్ల బకాయిలు..

గ్రేటర్ పరిధిలో సర్కిళ్ల వారీగా హెచ్‌టీ కనెక్షన్లు, వాటి నుంచి రావాల్సిన బిల్లులపై దక్షిణ డిస్కం ఆరా తీస్తోంది. ప్రధానంగా రాజేంద్రనగర్ సర్కిల్‌లో 99 కనెక్షన్ల నుంచి రూ. 123 కోట్లు, రంగారెడ్డి జోన్‌లో 167 కనెక్షన్ల - మిగతా IIవ పేజీలో

చెయ్యి తడిపితేనే.. పని

- ఏసీబీ దాడులు.. విజిలెన్స్‌కు ఫిర్యాదులు వెళ్లినా.. మారని తీరు
- అభివృద్ధి పనుల కంటే మమూళ్లపైనే దృష్టి
- పర్యవేక్షణలోపంతో అంతా అవినీతిమయం
- మేడ్చల్ జిల్లాలోని అన్ని మున్సిపాలటీల్లో ఇదే పరిస్థితి IVలో

కల్యాణ టికెట్లు, పాస్‌ల కుదింపు సరికాదు

బల్కంపేట ఎల్లమ్మకు ఎమ్మెల్యే తలసాని ప్రత్యేక పూజలు

IVలో

ఫిర్యాదు ఎందుకులే.. సెటిల్ చేసుకో..

సిటీలో చాలా స్టేషన్లలో ఇదే పరిస్థితి..

- కొందరు పోలీసుల తీరుపై బాధితుల అసహనం
- పెండింగ్ కేసులు పెరిగితే చీవాట్లే..
- పై అధికారుల ఒత్తిడితో రాజీల వైపే మొగ్గు

సిటీబ్యూరో, జూన్ 22(నమస్తే తెలంగాణ):

- కమాటిపుర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రాంతానికి చెందిన అఖిలేశ్ అనే వ్యక్తిపై శనివారం ఇద్దరు వ్యక్తులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ దాడిలో అతని పళ్లు ఊడిపోవడమే కాకుండా ముఖంపై బాగా దెబ్బలు తగిలాయి. తనపై దాడిచేసిన వారిపై ఫిర్యాదు చేయడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే బయటనే మాట్లాడుకోండి..ఈ పంచాయితీ ఇక్కడెందుకంటూ వారిని సముదాయించే ప్రయత్నం చేశారు పోలీసులు. ఫిర్యాదు తీసుకోకుండా బాధితులను స్టేషన్ చుట్టూ తిప్పుతున్నారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.
- మలక్‌పేటలో ఇటీవల ఓ అపార్ట్‌మెంట్‌లో ఇటీవల ఓ వ్యక్తిని అందరూ చూస్తుండగా తీవ్రంగా కొట్టిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ డియాలో వైరల్ - మిగతా IIవ పేజీలో

గ్రేటర్‌లో సరిపడా బస్సు సర్వీసులు లేకపోవడంతో ప్రయాణికులు అవస్థలుపడుతున్నారు. ఉన్న బస్సులు కూడా సమయానికి రాకపోవడంతో గంటల తరబడి నిరీక్షణ తప్పడం లేదు. సచివాలయం రహదారిలో బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులను చిత్రంలో చూడొచ్చు.